సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
గురువారం । 7 । సెప్టెంబర్ । 2023



శోభాయమానం
విశాఖ సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా స్వామి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.



అర్హులందరికీ సంక్షేమ పథకాలు
అర్హులకు సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయమని ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు అన్నారు. 8లో



జోల్డా పండగ సందడి
పాడేరు: మన్యంలో గిరిజనుల ఆచార, సంప్రదాయాలకు అద్దంపట్టే జోల్డా పండగ సందడి గ్రామాల్లో నెలకొంది.

న్యూస్‌రీల్

పాపికొండల పర్యటనకు ఆర్థికశాఖ ఉన్నతాధికారి



పాపికొండలు సందర్శనకు వెళ్తున్న ఆర్థికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రావత్

దేవీపట్నం: రాష్ట్ర ఆర్థికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రావత్ బుధవారం పాపికొండల పర్యటనకు వెళ్లారు. రాజమహేంద్రవరం నుంచి రోడ్డు మార్గంలో ఐఏఎస్ అధికారులు అభిషిక్త కిశోర్, ప్రవీణ్ ఆదిత్యలతో ఆయన పోశమ్మగండికి చేరుకున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో ముంపునకు గురవుతున్న గండిపోశమ్మ ఆలయ నిర్మాణ వివరాలను ఈవో జీవీ లక్ష్మీకుమార్ వివరించారు. అక్కడ నుంచి పర్యాటకశాఖ బోటుపై పేరంటపల్లికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వీఆర్‌పురం మండలం పోచారం బోటింగ్ పాయింట్‌కు చేరుకున్నారు. రహదారి మార్గంలో భద్రాచలంలోని సీతారాములను దర్శించుకున్నారు. ఆయన వెంట రంపచోడవరం సబ్‌కలెక్టర్ శుభం భన్సాల్ ఉన్నారు.

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ అనంతబాబు

దేవీపట్నం: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమపాలనకు ఆకర్షితులై పలు కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నాయి. దీనిలో భాగంగానే దేవారం పంచాయితీ పోతవరం గ్రామానికి చెందిన విశ్రాంత ఉద్యోగి తుర్రం కనకరాజు, ఆయన కుమారుడు యశ్వంత్, ఇందుకూరుపేటకు చెందిన దుర్గా గణేష్, కొత్తపల్లి జయరావు, కంకిపాటి రామ్మూర్తి, అడబాల వెంకన్న, కంచర్ల కనకరాజు, గోపిరెడ్డి పోశమ్మతో సుమారు 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరికి బుధవారం ఇందుకూరుపేటలో ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

రంగురాళ్ల తవ్వకాలు జరిపితే చర్యలు



తవ్వకాలు జరిపిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

జి.మాడుగుల: రంగురాళ్ల తవ్వకాలు చేపడితే చట్టపరమైన చర్యలు తప్పవని తహసీల్దార్ అప్పలస్వామి, ఎస్‌ఐ శ్రీనివాస్ హెచ్చరించారు. మండలంలో జోగులపుట్టు గ్రామ సమీపంలో కొండపై తవ్వకాలు జరిపిన ప్రాంతాలను బుధవారం పరిశీలించారు. ఇందుకు సంబంధించి వివరాలను సేకరించారు.

40 లీటర్ల సారా స్వాధీనం
● ముగ్గురి అరెస్టు



సారా నిందితులతో పోలీసులు

జి.మాడుగుల: చింతపల్లి మండలం అన్నవరం గ్రామం నుంచి జి.మాడుగుల వైపు అక్రమంగా నాటుసారా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 40 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని గిరిగొయ్యపాలెంకు చెందిన వంతాల సన్యాసిరావు, జి.మాడుగులకు చెందిన ఉల్లి చిట్టమ్మ, కులుపాడు గ్రామానికి చెందిన జె.శాంతి సారా తరలిస్తూ పట్టుబడ్డారని ఎస్‌ఐ తెలిపారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఆయన పేర్కొన్నారు.

ఉరకలేస్తున్న వాగులు

● మన్యంలో భారీ వర్షాలు
● చింతూరు డివిజన్‌లో కానరాని వరుణుడి జాడ

సాక్షి, పాడేరు: జిల్లాలో పాడేరు, రంపచోడవరం డివిజన్ల పరిధిలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. పెదబయలు, ముంచంగిపుట్టు, జి.మాడుగుల, చింతపల్లి, జి.కే.వీధి, కొయ్యూరు, హుకుంపేట, పెదబయలు, అనంతగిరి మండలాల్లో వాగులు, గెడ్డలు పొంగి ప్రవహిస్తుండటంతో మారుమూల గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. జిల్లా కేంద్రం పాడేరులో వర్ష ప్రభావం తక్కువగా ఉంది. ఘాట్‌తోపాటు మారుమూల గ్రామాల్లో మధ్యాహ్నం నుంచి వర్షం కురుస్తూనే ఉంది. జి.మాడుగుల నుంచి పాడేరు, హుకుంపేట, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల వరకు విస్తరించిన మత్స్యగెడ్డలో ఉధృతంగా ప్రవహిస్తోంది.

అధికార యంత్రాంగం అప్రమత్తం: కలెక్టర్ సుమిత్‌కుమార్



జిల్లాలోని పలు చోట్ల భారీ వర్షాలు కురుస్తున్నందున ముందస్తుగానే రెవెన్యూ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. మారుమూల ప్రాంతాల్లో ప్రమాదకరంగా ప్రవహిస్తున్న గెడ్డలను దాటేందుకు గిరిజనులు ప్రయత్నించవద్దని రెవెన్యూ యంత్రాంగం, గ్రామ సచివాలయాల కార్యదర్శులు, వీఆర్వోలతో గ్రామాల్లో హెచ్చరికలు జారీ చేశామన్నారు. చింతూరు డివిజన్‌లో వర్షాలు లేవన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు ఆదేశాలిస్తామని తెలిపారు. తాగునీటి వనరులు కలుషితం కాకుండా క్లోరినేషన్ చేపట్టేలా గ్రామ సచివాలయ సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు.

అత్యధికంగా కొయ్యూరులో..

జిల్లాలో మంగళవారం 460.8 ఎంఎం, బుధవారం 210.2 ఎంఎం వర్షపాతం నమోదైంది. బుధవారం అత్యధికంగా కొయ్యూరులో 62.0 ఎంఎం, అత్యల్పంగా అరకులోయలో 0.1 ఎంఎం నమోదైనట్టు అధికారవర్గాలు తెలిపాయి. అనంతగిరిలో 33.5ఎంఎం, హుకుంపేటలో 28.3, గూడెంకొత్తవీధిలో 24.8 ఎంఎం, పెదబయలులో 16.1ఎంఎం, అడ్డతీగలలో 12.4ఎంఎం, 11.4ఎంఎం, డుంబ్రిగుడలో 11.1ఎంఎం, ముంచంగిపుట్టులో 7ఎంఎం, రాజవొమ్మంగిలో 5ఎంఎం, చింతపల్లిలో 3.9ఎంఎం, గంగవరంలో 2.1ఎంఎం, మారేడుమిల్లిలో 1.3ఎంఎం, జి.మాడుగులలో 0.8ఎంఎం, ,పాడేరులో 0.6 ఎంఎం, రంపచోడవరంలో 0.5 ఎంఎం, చింతూరులో 0.5 ఎంఎం, వై.రామవరంలో 0.2 ఎంఎం నమోదైనట్టు అధికారులు తెలిపారు.



పాడేరు పరిసరాల్లో కురుస్తున్న భారీ వర్షం



గంపరాయి బ్రిడ్జి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న మత్స్యగెడ్డ

వెనుదిరిగిన ఆర్టీసీ బస్సు

రాజవొమ్మంగి: ఏలేశ్వరం నుంచి మండలంలోని కింద్ర గ్రామానికి నడిచే ఆర్టీసీ బస్సు మార్గం మధ్యలోని లబ్బర్తి చిన్నేరు వాగు బుధవారం పొంగి ప్రవహించడంతో వెనుతిరిగింది.ఈ ప్రాంతంలో వంతెన నిర్మించాలని దాదాపు ఎనిమిది గ్రామాల గిరిజనులు కోరుతున్నారు.

అనంతగిరిలో..

అనంతగిరి: మండల కేంద్రం అనంతగిరిలో ఉదయం నుంచి కురిసిన భారీ వర్షానికి జనజీవనం స్తంభించింది. ఘాట్‌రోడ్డులోని వరదనీరు భారీగా ప్రవహించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గోస్తనీ, శారద నదులు, గెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో పినకోట, పెదకోట, కివర్ల, రొంపల్లి పంచాయతీల్లో పలు మారుమూల గ్రామాలకు రాకపోకలు అంతరాయం ఏర్పడింది.

డుంబ్రిగుడలో..

డుంబ్రిగుడ: మండల కేంద్రంలో బుధవారం మధ్యాహ్నం నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో కించుమండ వారపు సంతకు వచ్చిన గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అలాగే భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. చాపరాయి, సంపంగి గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నందున ఆయా ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

అరకులో..

అరకులోయ రూరల్: మండల కేంద్రంలో బుధవారం ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. రోడ్లపైకి నీరు చేరడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు.

కొయ్యూరులో..

కొయ్యూరు: మండలంలో బుధవారం భారీ వర్షం కురిసింది. నాలుగురోజులుగా ఈ ప్రాంతంలో వర్షాలు కురుస్తున్నందున రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. బూదరాళ్ల, ఎం.భీమవరం, యూ.చీడిపాలెం తదితర మెట్ట ప్రాంతాల్లో రాజ్‌మా సాగు చేపట్టేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న లబ్బర్తి చిన్నేరు వాగు



రాజేంద్రపాలెంలో ఏకధాటిగా కురుస్తున్న వర్షం

10న గవర్నర్ అరకు పర్యటన

సాక్షి,పాడేరు: రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ ఈనెల 10వ తేదీన అరకులోయలో పర్యటిస్తున్నట్టు పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ తెలిపారు. ఈనెల 10వ తేదీ ఉదయం 10.25 గంటలకు హెలికాప్టర్‌లో విశాఖ నుంచి బయలుదేరి 11గంటలకు అరకులోయలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారని తెలిపారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో 11.30 గంటలకు రైల్వే అతిథి గృహానికి చేరుకొని అక్కడ నుంచి పద్మాపురం గార్డెన్‌కు వెళ్తారన్నారు. అక్కడి ట్రీకాస్టిల్‌తోపాటు గిరిజన మ్యూజియాన్ని గవర్నర్ సందర్శిస్తారని తెలిపారు. 12.20 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి సుంకరమెట్ట కాఫీతోటలను పరిశీలిస్తారని పీవో పేర్కొన్నారు. అక్కడి నుంచి 1.15 గంటలకు బయలుదేరి అరకు ఏపీటీడీసీ అతిథి గృహానికి చేరుకుంటారని తెలిపారు. అక్కడి నుంచి 1.50 గంటలకు విశాఖపట్నం తిరుగు ప్రయాణమవుతారని పీవో అభిషేక్ వెల్లడించారు.

పట్టుదలతో చదివితే తప్పనిసరిగా విజయం



వీర చక్రదొరను సన్మానిస్తున్న సీఐ

రాజవొమ్మంగి: పట్టుదలతో చదివితేనే లక్ష్యం సాధించవచ్చని రాజవొమ్మంగి సీఐ షేక్ బాజిలాల్ సూచించారు. ఇటీవల ఎస్‌ఐ ఉద్యోగానికి ఎంపికైన మండలంలోని దూసరపాము గ్రామానికి చెందిన పోతంశెట్టి వీరచక్రదొరను బుధవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో సత్కరించారు. సీఐ మాట్లాడుతూ సాధారణ వ్యవసాయ కూలీ కుటుంబానికి చెందిన వీరచక్రదొర తల్లిదండ్రుల కష్టార్జితంతో ఉన్నత స్థానానికి ఎదగడం ఎంతో మంది యువకులకు స్ఫూర్తిదాయకమన్నారు. పాలు అమ్ముతూ కష్టపడి కుమారుడిని చదివించిన ఆ తల్లిదండ్రుల కృషి అభినందనీయమని కొనియాడారు. ఎస్‌హెచ్‌వో గోపీ నరేంద్రప్రసాద్, అడిషినల్ ఎస్‌ఐ జాన్‌కుమార్ పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి,పాడేరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ వనుము చిట్టబ్బాయి తెలిపారు. 2023–24కు సంబంధించి కామర్స్, హిస్టరీ, కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్, లైబ్రేరియన్, ఫిజికల్ డైరెక్టర్, హార్టికల్చర్, తెలుగు సబ్జెక్టులకు సంబంధించి ఖాళీలు ఉన్నాయన్నారు. అభ్యర్థులు ఆయా సబ్జెక్టుల్లో 55శాతం మార్కులతో పీజీ ఉండాలన్నారు.ఎంఫిల్, పీహెచ్‌డీ, నెట్‌సెట్ అభ్యర్థులకు తొలి ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఈ పోస్టుల్లో చేరేందుకు ఆసక్తి గల అర్హులైన అభ్యర్థులు ఈనెల 15వతేదీ లోగా కళాశాలకు అందజేయాలని ఆయన సూచించారు.

రంపచోడవరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఎఫ్) గ్రూప్ సబెక్టు బోధించేందుకు అధ్యాపక పోస్టు ఖాళీగా ఉన్నట్లు ప్రిన్సిపాల్ వీవీ దుర్గాప్రసాద్ తెలిపారు.బీఎస్సీ నర్సింగ్ చదివిన వారు అర్హులని తెలిపారు. 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు రంపచోడవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల లేదా 9848378412 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

ముంచంగిపుట్టు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న బోటనీ, మ్యాథ్స్ అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని డీఐఈవో అప్పలస్వామి, ప్రిన్సిపాల్ శ్రావణ్‌కుమార్ తెలిపారు.అభ్యర్థులు పీజీలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండి,అభ్యర్థుల బయోడేటాతో పాటు రెండు జతల ధ్రువపత్రాలు నకలను జత చేసి దరఖాస్తు పెట్టుకోవాలని,ముంచంగిపుట్టు కళాశాలలో ప్రతి రోజు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. పాడేరులోని ఇంటర్ బోర్డు అధికారి కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరుగుతాయని వారు పేర్కొన్నారు.

క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు





ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన కొత్తాడ, రాజుపేటలొద్ది జట్ల సభ్యులకు బహుమతులు అందజేస్తున్న ఏఎస్పీ జగదీష్ అడహళ్లి, స్థానిక ప్రజాప్రతినిధులు

రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహళ్లి

గంగవరం : యువకులు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహళ్లి అన్నారు. రాజుపేటలొద్ది గ్రామంలో భవిత సేవా సంస్థ ఈడీ వరికూటి ప్రభుదాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి వాలీబాల్ క్రీడా పోటీలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన ముగింపు సభకు ఏఎస్పీతోపాటు జెడ్పీటీసీ బేబీరత్నం, వైస్ ఎంపీపీ కుంజం గంగాదేవి తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. టోర్నీలో ప్రథమస్థానం సాధించిన కొత్తాడ జట్టుకు రూ.10 వేలు, ద్వితీయస్థానంలో నిలిచిన రాజుపేటలొద్ది జట్టుకు రూ.7,500, తృతీయ స్థానంలో నిలిచిన గొరగొమ్మి రూ.5 వేల చొప్పున నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ గంగాదేవి, గంగవరం ఎస్‌ఐ చినబాబు, సూరంపాలెం సర్పంచ్ బి.శివదొర, మొల్లేరు సొసైటీ డైరెక్టర్ పండా సిద్ధార్థ దొర పాల్గొన్నారు.

నేడు వేణుగోపాలునికి పంచ హారతులు

నక్కపల్లి: ఉపమాక శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం అన్ని ఏర్పాట్లు చేసింది. ఆలయానికి క్షేత్రపాలకుడిగా ఉన్న వేణుగోపాలస్వామి విగ్రహాన్ని నారద మహాముని ప్రతిష్టించారని స్థల పురాణం చెబుతోంది. కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు, ఉపాలయాల్లో ఉత్సవమూర్తులకు నిత్యార్చనలు, అభిషేకాలు నిర్వహిస్తామని ప్రధానార్చకుడు గొట్టుముక్కల వరప్రసాద్ తెలిపారు. యశోదాదేవి ఒడిలో కూర్చొని కృష్ణుడు పాలు తాగుతున్నట్లుగా అలంకరణ జరుగుతుందన్నారు. సాయంత్రం 6 గంటలకు యశోద దేవికి, వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు, రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామివారికి వరుసగా ధూప హారతి, చంద్ర హారతి, గరుడ హారతి, నక్షత్ర హారతి, పీఠ హారతి, గజ హారతి కుంభ హారతులు సమర్పించడం జరుగుతుందన్నారు. శుక్రవారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామివారిని రాజాధిరాజ వాహనంలో ఊరేగించి, ఉట్ల పండగ నిర్వహిస్తామన్నారు.



ఉపమాక వెంకన్న ఆలయంలో వేణుగోపాలుడు

ముకుందా.. ముకుందా..

ఘనంగా కృష్ణాష్టమి



జిల్లాలో కృష్ణాష్టమి పర్వదినాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉట్టి సంబరాలు జరిపారు. పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో పిల్లలు కృష్ణుడు, రాధ రూపాల్లో అలరించారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కొన్నిచోట్ల గురువారం కూడా కృష్ణాష్టమి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 9లో



చింతపల్లిలో ఉట్టి కొడుతున్న యువకులు

రేపు మెగా జాబ్‌మేళా

కంచరపాలెం (విశాఖ) : స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరియర్ సర్వీస్ సెంటర్‌లో ఈనెల 8వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారులు సిహెచ్ సుబ్బిరెడ్డి(క్లరికల్), కె.శాంతి(టెక్నికల్) తెలిపారు. ఆర్కే హాస్పిటల్, క్వీన్స్ ఎన్నారై, ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్, ఎంజీఎం క్యాన్సర్ హాస్పిటల్, అపోలో ఫార్మసీ హీరో మోటో కార్ప్, హెటిరో డ్రగ్స్, ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్, టీసీఎల్–సీఎల్‌వోటీ, ఇండస్, కేర్ హాస్పిటల్, సెవెన్ హిల్స్ హెల్త్ కేర్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో 665 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. బిల్లింగ్, కస్టమర్ అండ్ ఫీల్డ్ ట్రైనీ, సేల్స్ డెవలప్‌మెంట్ మేనేజర్, ఫార్మసిస్ట్, అసెంబ్లీ ఆపరేటింగ్ కాల్ అసిస్టెంట్, ఆపరేటర్, కస్టమర్ రిప్రెసెంటేటివ్ ఎగ్జిక్యూటివ్, కెమిస్ట్, క్యాషియర్, కార్పెంటర్, వెర్‌హౌస్ అసోసియేట్స్, టీం లీడర్స్, ఓటీ స్క్రబ్ నర్స్, ఇన్‌చార్జ్ నర్స్, అకౌంటెంట్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్, కేర్ టేకర్స్,సెక్యూరిటీ గార్డ్స్, బ్రాంచ్ గోడౌన్ ఇన్‌చార్జ్, కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాలు ఉన్నాయన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, పోస్ట్ గ్యాడ్యుయేట్, ఐటీఐ, డిప్లమా, బీటెక్, ఎంబీఏలో ఉత్తీర్ణత సాధించి 20–40 ఏళ్ల వయసు కల్గిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. జీతం నెలకు రూ.12,500 నుంచి రూ.32,000ల వరకు ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు ncr.gov.in వెబ్‌సైట్‌లో పేర్లు రిజిస్టర్ చేసుకోవాలన్నారు.

పంచాయతీల ఆదాయం పెంచేందుకు కృషి

రంపచోడవరం డీఎల్పీవో రాఘవన్



రంపచోడవరం: ఏజెన్సీలో పంచాయతీ ఆదాయాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టినట్లు డీఎల్పీవో జీవీఎస్ రాఘవన్ అన్నారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ ఏజెన్సీకి కొత్తగా ఐదు ఈవోపీఆర్‌డీ పోస్టులు మంజూరయ్యాయన్నారు. వీరు విధుల్లో చేరడం వలన పర్యవేక్షణ పెరుగుతుందన్నారు. రంపచోడవరం, మారేడుమిల్లి మండలాల్లో నిబంధనల ప్రకారం పన్నులు చెల్లించకుండా నిర్వహిస్తున్న రిసార్ట్స్ యాజమానులకు నోటీసులు ఇచ్చినట్టు తెలిపారు. రంపచోడవరం కార్యదర్శికి సంబంధించి వచ్చిన ఫిర్యాదులపై ఈ నెల 8న విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. బొడ్లంక పంచాయతీకి సంబంధించి కూడా విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. ఏజెన్సీలో ప్లాస్టిక్ వాడకం నిషేధమన్నారు. అయినప్పటికీ వినియోగిస్తున్నారన్నారు. సచివాలయ సిబ్బందితో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ప్లాస్టిక్ వినియోగంపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. డ్రైడే–ఫ్రైడే నాడు కార్యాలయాల్లో పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఏజెన్సీలో ప్రాంతానికి వచ్చే పర్యాటకుల నుంచి ప్లాస్టిక్ బాటిళ్లను ఏజెన్సీ ముఖద్వారం వద్దే సేకరించేలా కసరత్తు చేపట్టామన్నారు. పంచాయతీల్లో పారిశుధ్య కార్యక్రమాలు పక్కాగా అమలుకు చర్యలు తీసుకుంటున్నామని డీఎల్పీవో తెలిపారు.

గిరిజన మహిళ మృతిలో వైద్యుల నిర్లక్ష్యం లేదు

● కేజీహెచ్ సూపరింటెండెంట్ అశోక్‌కుమార్

మహారాణిపేట: అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం గొమంగికి చెందిన కొమ్మ కాసులమ్మ(55) కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. వైద్యం అందకే తన తల్లి మరణించిందని ఆమె కుమారుడు ఆరోపించగా.. ఇందులో వైద్యుల నిర్లక్ష్యం లేదని కేజీహెచ్ సూపరింటెండెంట్ స్పష్టం చేశారు. పక్షవాతం, బీపీ, చాతీ నొప్పితో బాధపడుతున్న కాసులమ్మ పాడేరు ఆస్పత్రి నుంచి మంగళవారం మధ్యాహ్నం కేజీహెచ్‌లో చేరారు. ఎస్టీ సెల్ సిబ్బంది ఆమెను భావనగర్ వార్డు ఏఎంసీ యూనిట్‌లో చేర్పించారు. అక్కడే చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం ఆమె మృతి చెందారు. వెంటనే ఐటీడీఏ వాహనంలో కాసులమ్మ మృతదేహాన్ని ఆమె స్వస్థలానికి తరలించారు. కాగా.. తన తల్లికి సరైన వైద్యం అందక చనిపోయిందని ఆమె కుమారుడు, గిరిజన సంఘ నాయకుడు పృథ్వీరాజ్ ఆరోపించారు. గిరిజనులకు ఎక్కడా వైద్యం అందడం లేదని ఓ వీడియోను విడుదల చేశారు. దీనిపై కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్ మాట్లాడుతూ ఈ ఘటనలో వైద్యుల నిర్లక్ష్యం లేదని స్పష్టం చేశారు. బీపీ కారణంగా కాసులమ్మ మెదడులో నరాలు చిట్లిపోయి రక్తస్రావం అయిందని వివరించారు. పాడేరు ఆస్పత్రిలో కొన్ని రోజుల పాటు చికిత్స అనంతరం కేజీహెచ్‌కు తీసుకొచ్చారని.. అప్పటికే ఆమె కోలుకోలేని స్థితిలో ఉందన్నారు. ఆమెను బతికించడానికి వైద్యులు శ్రమించినట్లు చెప్పారు. వార్డులో చికిత్స పొందుతున్న సమయంలో తాను స్వయంగా ఆమెను పరామర్శించినట్లు వివరించారు.

కిరండూల్ పాసింజర్ రద్దు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ గోరాపుర్–అరకు–సిమిలిగుడ సెక్షన్ పరిధిలో జరుగుతున్న డబ్లింగ్ పనుల నిమిత్తం కేకే లైన్‌లో ప్రయాణించే కిరండూల్ పాసింజర్ స్పెషల్ రైలును ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ త్రిపాఠి తెలిపారు. విశాఖపట్నంలో ప్రతీరోజు బయల్దేరే విశాఖపట్నం–కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు, కిరండూల్‌లో ప్రతీ రోజు బయల్దేరే కిరండూల్–విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్ ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకు రద్దయినట్లు పేర్కొన్నారు.

బాలింత మృతి

● గర్భంలో శిశువు మృతితో అస్వస్థత
● ఏనుగుబయలులో ఘటన

గూడెంకొత్తవీధి: బిడ్డను బతికించేందుకు తల్లి పురిటినొప్పులను అనుభవించింది. తల్లి కడుపు నుంచి బయటకు రావాలని బిడ్డ ప్రయత్నించింది. కానీ విధి వక్రీకరించింది. వారం వ్యవధిలో తల్లీబిడ్డ ప్రాణాలు కోల్పోయారు. రెండు రోజుల క్రితం ధారకొండ పంచాయతీ ఏనుగుబయలులో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గత నెల 28న ఏనుగుబయలుకు చెందిన గర్భిణి జంగం విమలకుమారిని ఆరోగ్యం తనిఖీ నిమిత్తం చింతపల్లి కమ్యూనిటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచనల మేరకు గత నెల 29 వరకు అక్కడే ఉంచారు. అయితే బీపీ ఎక్కువైందని ఇంజక్షన్లు చేయడంతో విమలకుమారికి ఫిట్స్ వచ్చి స్పృహ కోల్పోయిందని ధారకొండ సర్పంచ్ నడిగెట్ల రాజు బుధవారం తెలిపారు.ఆమె స్పృహ కోల్పోగానే అక్కడ నుంచి నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి తరలించారన్నారు. అక్కడ పరిస్థితి విషమించడంతో వెంటనే కేజీహెచ్‌కు తరలించారని తెలిపారు. అయితే తల్లి గర్భంలోనే మృతి చెందిన బిడ్డను పైకి తీసే సమయంలో ఆమెకు బీపీ పెరిగిందన్నారు. కేజీహెచ్‌లో రెండు సార్లు ఆమెకు ఆపరేషన్ కూడా చేశారన్నారు. అయితే ఆమె శరీరం సహకరించకపోవడంతో ఈనెల నాలుగో తేదీ రాత్రి మృతి చెందిందని తెలిపారు. విమలకుమారి ఆరోగ్యం బాగులేని వెంటనే చింతపల్లి ఆస్పత్రి వైద్యులు రిఫర్ చేసి ఉంటే తల్లీబిడ్డలు బతికి ఉండేవారని సర్పంచ్‌తోపాటు మృతురాలి భర్త మెగాసింగ్ పేర్కొన్నారు.





మృతి చెందిన శిశువు, తల్లి విమలకుమారి (ఫైల్)

క్లుప్తంగా

కల్వర్టును ఢీకొట్టిన కారు



అదుపుతప్పి కల్వర్టును ఢీకొన్న కారు

ఎటపాక: మండల పరిధిలోని లక్ష్మీ పురం వద్ద కారు అదుపుతప్పి కల్వర్టును ఢీకొట్టిన ఘటన బుధవారం జరిగింది. హైదబాద్ నుంచి చింతూరుకు వెళ్తున్న కారు (టీ ఎస్ 32జీ 1314) లక్ష్మీపురం, బూరుగువాయి మధ్యలో జాతీయ రహదారిపై ఉన్న కల్వర్టును ఢీకొంది. ప్రమాదంలో నలుగురు ప్రయాణికులకు స్వల్పగాయాలయ్యాయి. వీరిని సమీపంలోని లక్ష్మీపురం పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లో భద్రాచలం తరలించారు.

ఏలేరు కాలువలో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



పింజరికొండ వద్ద ఏలేరు వాగులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

అడ్డతీగల : అడ్డతీగల మండలం పింజరికొండ వద్ద ఏలేరు కాలువపై పవర్ ప్రాజెక్ట్ అడ్డుగోడపై నుంచి పడి గుర్తు తెలియని ఒక వ్యక్తి బుధవారం మృతి చెందినట్టు అడ్డతీగల ఎస్ఐ అప్పలరాజు తెలిపారు. సుమారు 55 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి బుధవారం ఉదయం అడ్డుగోడపై నుంచి వెళుతూ నీటి ప్రవాహానికి ప్రమాదవశాత్తూ కాలుజారి పడిపోయి చనిపోయాడన్నారు. ఇతని వివరాలు తెలిసిన వారు అడ్డతీగల పోలీస్‌స్టేషన్‌లోని 9440900769 మొబైల్ నంబర్‌లో సంప్రదించాలని చెప్పారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



వై.రామవరంలో నూతన పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి



రంపచోడవరంలో కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ అనంతబాబు

దేవీపట్నం: అర్హులైన ప్రతి పేదవాడికి పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు అన్నారు. ఇందుకూరుపేటలో బుధవారం జరిగిన కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. నూతనంగా మంజూరైన 210 మందికి పింఛన్లు అందించారు. గత ప్రభుత్వంలో అర్హతలున్నప్పటికీ పింఛన్ పొందాలంటే నానా అవస్థలు పడాల్సివచ్చేదని, తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పార్టీలు, రాజకీయాలకతీతంగా ఇంటింటికీ నేరుగా పింఛన్లు అందించిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి కొండా రాజీవ్, ఎంపీపీ కుంజం మురళీ, జెడ్పీటీసీ సభ్యురాలు శిరశం సత్యవేణి, ఎంపీడీఓ రత్నకుమారి, నాయకులు బాబ్జి, సత్యనారాయణ, మురళీకృష్ణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

వై.రామవరం: జగనన్న ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. వై.రామవరంలో బుధవారం నిర్వహించిన కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. జగనన్న ప్రభుత్వ పాలనలో ప్రతీ పథకాన్ని నేరుగా లబ్ధిదారుని బ్యాంకు ఖాతాలోకే జమచేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ అందరూ మద్దతు ఇచ్చి, వచ్చే ఎన్నికల్లో జగనన్న ప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు. మండలంలో ప్రస్తుతం 3389 పించన్లు ఉండగా ప్రస్తుతం మరో 285 కొత్త పించన్లు మంజూరు అయ్యాయన్నారు. వలంటీర్ల ఇంటింటికి వెళ్లి సేవలు అందిస్తున్నారన్నారు. అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ కర్ర వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు ముర్ల జోగిరెడ్డి, వలాల విశ్వమ్మ, ఎంపీటీసీ వీరమళ్ల సుబ్బలక్ష్మి, సర్పంచ్‌లు, జిల్లా పార్టీ కమిటీ సభ్యుడు త్రిమూర్తులు, మండల పార్టీ కన్వీనర్ అప్పారావు, మండల సచివాలయాల కన్వీనర్ కనకరాజు ఎంపీడీవో శ్రీనివాసులు, ఈవోపీఆర్‌డీ మధుసూధనరాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం: అర్హులైన ప్రతి పేదవారికి పింఛన్లు మంజూరుచేస్తున్నట్టు ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్(అనంతబాబు) అన్నారు. మండల కేంద్రంలో బుధవారం జరిగిన కొత్త పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ మండలంలో 204 మందికి కొత్త పింఛన్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు.ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శనీయమన్నారు. జగనన్న ఇచ్చిన మాట ప్రకారం ఏటా పింఛన్ సొమ్మును పెంచుతున్నారన్నారు. ఏజెన్సీలో వైద్య సేవలను బలోపేతం చేసే దిశగా ప్రతీ పీహెచ్‌సీలో వైద్య పోస్టులు భర్తీ చేశారన్నారు. విలేజ్ క్లినిక్ ప్రోగ్రాం ద్వారా ప్రతి ఇంటికి వెళ్లి వైద్య ఆరోగ్యశాఖ ద్వారా వైద్య సేవలు అందిస్తున్నట్టు చెప్పారు. రంపచోడవరంలో సుమారు రూ.50 కోట్ల వ్యయంతో అన్ని వైద్య సేవలు అందించే విధంగా మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కొండపోడు వ్యవసాయం చేసుకుంటున్న గిరిజనులకు పట్టాలు అందజేసి రైతు భరోసా అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దక్కుతుందన్నారు. ఎంపీపీ బందం శ్రీదేవి, జడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి వైస్‌ఎంపీపీలు కొమ్మిశెట్టి బాలకృష్ణ, పండా కుమారి, ఎంపీటీసీలు ఉలవల లక్ష్మి, నర్రా పాపారావు, కుంజం వంశీ, సర్పంచ్‌లు బొజ్జయ్య, ప్రసాద్, రమేష్‌బాబుదొర, అన్నవరం బోర్డు మెంబర్ పూజ, సొసైటీ అధ్యక్షుడు రామన్నదొర, సచివాలయ కన్వీనర్ రామకృష్ణదొర, ఎంపీడీఓ బి.హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బంగారు ఆభరణాల అపహరణ

గొలుగొండ: విశాఖలో జరిగిన పెళ్లికి వెళ్లి బస్సులో తిరిగి వస్తున్న మహిళ నుంచి గుర్తు తెలియని వ్యక్తులు నాలుగు తులాల బంగారు ఆభరణాలు చోరీ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగల గ్రామానికి చెందిన వెంకట సీతామహాలక్ష్మి మంగళవారం విశాఖపట్నంలో బంధువుల ఇంటిలో జరిగిన పెళ్లికి వెళ్లింది. బుధవారం విశాఖ నుంచి నర్సీపట్నం చేరుకుని అక్కడ నుంచి స్వగ్రామం అడ్డతీగల వెళ్లేందుకు బస్సు ఎక్కింది. బస్సు గొలుగొండ చేరుకునే సమయంలో బ్యాగులో బంగారం కనిపించలేదు. మెడలోని బంగారు ఆభరణాలను తీసి బ్యాగ్‌లో వేసి, ప్రయాణిస్తున్న సమయంలో చోరీకి గురయ్యాయని, గొలుగొండ పీహెచ్‌సీ మార్గంలో ముగ్గురు వ్యక్తులు బస్సు దిగి వెళ్లిపోయిన విషయం గమనించానని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. నెక్లెస్, ఉంగరాలు చోరీ అయినట్టు పేర్కొంది. ఎస్ఐ నారాయణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

8న 'ఐటీడీఏ స్పందన' రద్దు

సాక్షి, పాడేరు: ఈనెల ఎనిమిదో తేదీన నిర్వహించనున్న ఐటీడీఏ స్పందన కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్టు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర గవర్నర్ ఈనెల 10న అరకులోయలో పర్యటిస్తున్న నేపథ్యంలో శుక్రవారం నిర్వహించాల్సిన స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్టు వెల్లడించారు. అర్జీదారులు స్పందన కార్యక్రమాన్ని పాడేరు రావొద్దని సూచించారు.

నూకాంబిక నూతన తేజం

- నేడు ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభం
- వచ్చే ఏడాది కొత్త అమావాస్య జాతర నాటికి పూర్తి



సాక్షి, అనకాపల్లి: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు అనకాపల్లి నూకాంబిక అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనులు గురువారం ప్రారంభమవుతున్నాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా.. నిర్మాణ పనులు చకచకా చేపట్టే విధంగా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. వచ్చే ఏడాది కొత్త అమావాస్య జాతర నాటికి పనులు పూర్తి చేయనున్నారు. ఆగమ శాస్త్రం ప్రకారం ఆలయాన్ని పునర్నిర్మిస్తున్నట్లు ఆలయ అధికారులు, పురోహితులు పేర్కొన్నారు. ఆలయ పునర్నిర్మాణానికి మొత్తం రూ.11 కోట్ల వ్యయం అవుతున్నట్లు అంచనా వేశారు. వీటిలో తొలివిడతగా రూ.3.5 కోట్లతో నూతన గర్భాలయం, అంతరాలయం, అనువెట్టి మండపం, మలివిడతలో రూ.5 కోట్లతో ప్రాకార మండపం పనులు చేపట్టనున్నారు. వీటిలో టీటీడీ నుంచి రూ.1.5 కోట్లు మంజూరయ్యాయి. ప్రస్తుతం రూ.8.5 కోట్లతో పనులు చేపడుతున్నప్పటికీ పూర్తిస్థాయి ఆలయ నిర్మాణానికి దాదాపు రూ.11 కోట్లు ఖర్చవుతుంది. అన్నదాన సత్రంతోపాటు 100 గదులు ఉండేలా కల్యాణ మండపం నిర్మాణం చేపడుతున్నారు.

ప్రస్తుతం గర్భాలయం 14 అడుగుల వెడల్పు, 14 అడుగుల పొడవు ఉంది. 17.11 అడుగుల వెడల్పు, పొడవు ఉండేటట్లు పునర్నిర్మిస్తారు. 12, 14 వెడల్పు, పొడవుగల అంతరాలయాన్ని 17.11 అడుగుల పొడవు, 15.3 వెడల్పుతో నిర్మిస్తారు. 98 అడుగుల పొడవు, 60 అడుగుల వెడల్పుతో ఉన్న ప్రాకార మండపాన్ని రాజగోపురంతో కలిపి 175 అడుగుల పొడవు, 93 అడుగుల వెడల్పుతో నిర్మిస్తారు. రాతి కట్టుతో గర్భాలయ నిర్మాణం చేపడతారు.

ఆగమ శాస్త్ర ప్రకారమే...

ఆగమ శాస్త్ర ప్రకారం ఆలయంలో శిల్పాల నిర్మాణం ఉంటుంది. ప్రస్తుత ఆలయాన్ని క్రమేపీ తొలగిస్తూ శాస్త్ర నియమం మేరకు నూతన ఆలయాన్ని నిర్మిస్తారు. దేవాలయాన్ని మూడు భాగాలుగా విభజించి పనులు చేపడతారు. టీటీడీ ఛైర్మన్ హోదాలో వై.వి.సుబ్బారెడ్డి ఆలయానికి వచ్చినప్పుడు ఆలయ అభివృద్ధికి సహకారం కోరిన వెంటనే ఆయన టీటీడీ నుంచి రూ.1.5 కోట్లు మంజూరు చేశారు.

బాలాలయంలో దర్శనాలు



800 ఏళ్ల చరిత్ర గల అమ్మవారి ఆలయాన్ని భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని పునర్నిర్మిస్తున్నాం. గురువారం ఉదయం 11.20 గంటలకు నూకాంబిక అమ్మవారి ఆలయంలో వైదికపరమైన ప్రక్రియను వైదికులు ఏకాంతంగా జరిపిస్తారు. అమ్మవారి మూలవిరాట్ దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేస్తాం. దేవస్థానం కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన బాలాలయంలో అమ్మవారిని దర్శించవచ్చు.

– బండారు ప్రసాద్, ఆలయ ఈవో

నేటి నుంచి రాష్ట్రీయ ఏక్తా పర్వ ఉత్సవాలు



ఉత్సవాలకు ముస్తాబవుతున్న కేవీ - 2 పాఠశాల

కంచరపాలెం: కేంద్రీయ విద్యాలయం – 2 శ్రీవిజయనగర్‌లో ఏపీ సంఘటన్ ఎస్సీఈఆర్టీ – కేంద్ర విద్యా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నుంచి రాష్ట్రీయ ఏక్తా పర్వ ఉత్సవాలు, ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కళా ఉత్సవ్ 2023 – 24 ఘనంగా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసులు తెలిపారు. కేంద్రీయ విద్యాలయ సంఘటన్ హైదరాబాద్ ప్రాంతీయ స్థాయికి చెందిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల కేంద్రీయ విద్యాలయాలకు చెందిన 8 క్లస్టర్లు, 72 విద్యాలయాల్లోని సుమారు 400 మంది బాలబాలికలు నృత్యం, సంగీతం, డ్రామా, విజువల్ ఆర్ట్, టాయ్ మేకింగ్ వంటి వివిధ కళారూపాల్లో పోటీ పడనున్నట్లు తెలిపారు. ఐఎన్ఎస్ శాతవాహన కమాండ్ అధికారి, విద్యాలయ చైర్మన్ కమడోర్ రజత్, విద్యావేత్తలు పోటీలను ప్రారంభించనున్నట్లు తెలిపారు.

ఈజీ మనీకి ఆశపడి.. మోసపోయి

- రూ.2.76 లక్షలు పోగొట్టుకున్న బాధితురాలు
- అచ్యుతాపురం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు

అచ్యుతాపురం(అనకాపల్లి): ఆన్‌లైన్ మోసానికి మరొకరు నష్టపోయారు. సైబర్ నేరాలపై పోలీసులు, ప్రభుత్వం ఎంతగా ప్రచారం చేస్తున్నా.. అడ్డగోలుగా, తక్కువ వ్యవధిలో ఎక్కువ సంపాదించాలనే ఆశ గల వ్యక్తులు సైబర్ నేరగాళ్ల వలకు చిక్కుతున్నారు. ఇదే తరహాలో 'ఇంటి దగ్గర ఉండి సులభంగా డబ్బులు ఎలా సంపాదించాలి'అనే లింకు క్లిక్ చేసి, అచ్యుతాపురానికి చెందిన మహిళ రూ.2 లక్షల 76 వేలను పోగొట్టుకుంది. దీంతో పేరు బయటపెట్టేందుకు ఇష్టపడని సదరు బాధితురాలు అచ్యుతాపురం పోలీసులను బుధవారం ఆశ్రయించింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాయిన్ స్విచ్ పేరిట ఏర్పాటైన సంస్థ ప్రజల్ని మోసం చేయాలనే ఉద్దేశ్యంతో వాట్సాప్ నంబర్లకు వివిధ రకాల యాడ్ లింకులు పంపిస్తోంది. ఇంటి దగ్గరే ఉంటూ మొబైల్ ఫోన్ ద్వారానే ఈజీగా డబ్బులు సంపాదించుకోవచ్చని నమ్మబలికింది. తాము పంపే స్టార్ హోటల్స్, రెస్టారెంట్లకు రేటింగ్ ఇస్తే చాలని చెప్పింది. ఒక్కో రేటింగ్‌కు రూ.70 నుంచి రూ.210 వరకు కమీషన్ చెల్లిస్తామని నమ్మించింది. అనంతరం కొన్ని టాస్కలు ఉంటాయని, వాటిని పూర్తి చేస్తే మరింత సంపాదించుకోవచ్చని ప్రలోభపెట్టింది. రూ.1000 చెల్లించి ఓ టాస్క్ ఎంపిక చేసిన వారికి బోనస్ రూ.200 కలిపి ఆరంభంలో రూ.1200 చెల్లించింది. అలా వారిలో నమ్మకాన్ని పెంచడంలో సంస్థ నిర్వాహకులు సఫలీకృతులయ్యారు. తర్వాత పెద్ద మొత్తంలో టాస్కలకు చెల్లింపులు చేశాక, టాస్క్ పూర్తి చేయడంలో పొరపాటు చేయడం వల్ల డబ్బులు ఫ్రీజ్ అయినట్టు చెప్పేవారు. ఆ మొత్తం రిలీజ్ కావాలంటే అదనంగా టాస్కలు తీసుకోవాలన్నారు. బాధితురాలు ఇలా అదనపు చెల్లింపులతో రూ.2.76 లక్షలను పోగొట్టుకుంది. ఆ మొత్తం రావాలంటే మరో రూ.4 లక్షలు చెల్లించాలని నిర్వాహకులు చెప్పడంతో మోసపోయినట్లు గుర్తించిన ఆమె ఎట్టకేలకు పోలీసులనాశ్రయించింది. అచ్యుతాపురం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చిత్రకారుడు నరసింహాచార్యులు మృతి



నరసింహాచార్యులు (ఫైల్)

గాజువాక : ప్రముఖ సింబాలిక్ చిత్రకారుడు కె.నర్సింహాచార్యులు (83) బుధవారం మృతి చెందారు. విశాఖకు చెందిన ప్రముఖ చిత్ర కళాసంస్థ చిత్ర కళాపరిషత్‌కు ప్రస్తుతం ఆయన అధ్యక్షుడిగా ఉన్నారు. రాజమండ్రికి చెందిన ప్రఖ్యాత చిత్రకారుడు ఎం.రాజాజీవద్ద చిత్రలేఖనం నేర్చుకున్న ఆయన షిప్‌యార్డు ఉన్నత పాఠశాలలో చిత్ర కళా ఉపాధ్యాయుడిగా నాలుగు దశాబ్దాలపాటు పని చేసి రిటైరయ్యారు. ఆయన పలు జాతీయ, రాష్ట్ర స్థాయిలో వివిధ అవార్డులు, బహుమతులను గెలుపొందారు. ఆయనకు భార్య, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. గాజువాక బీసీ రోడ్‌లోని తమ స్వగృహంలో నివాసముంటున్న ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నారు. నరసింహాచార్యులు మృతికి చిత్రకారులు సుంకర చలపతిరావు, జి.కె.విశ్వనాథరాజు, మనోహర్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

బైక్‌లు దొంగలించిన కేసులో ఇద్దరికి జైలు

మల్కాపురం: వివిధ ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలను దొంగిలించిన కేసులో ఇద్దరికి రెండేళ్లు, మరొకరికి ఏడాది జైలు శిక్షతో పాటు ముగ్గురికీ రూ.5 వేలు చొప్పున జరిమానా విధిస్తూ 3వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి జి.రాజేంద్రబాబు బుధవారం తీర్పు చెప్పారు. వివరాలివీ.. అనకాపల్లి ప్రాంతానికి చెందిన భీశెట్టి మహేష్ కుమార్, నరేష్ మల్కాపురం, శ్రీహరిపురం తదితర ప్రాంతాల్లో ఆరు బైక్‌లను దొంగలించారు. ఈ వాహనాలను బుచ్చయ్యపేట ప్రాంతానికి చెందిన నమ్మి రమణకు విక్రయించారు. తమ బైక్‌లు చోరీకి గురయ్యాయని వాహన యజమానులు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో.. క్రైం ఎస్ఐ పల్లా దుర్గా భవానీశంకర్ దర్యాప్తు చేపట్టారు. ఈ కేసుకు సంబంధం ఉన్న ముగ్గురినీ అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరిచారు. నేరం రుజువు కావడంతో మహేష్, నరేష్‌కు రెండేళ్ల జైలు, రమణకు ఏడాది జైలు శిక్ష విధించారు. ఏపీపీ పి.వాణి కేసును వాదించారు.

వేళకు బస్సులు నడపాలి




సమీక్ష సమావేశంలో పాల్గొన్న అధికారులు

డాబాగార్డెన్స్: అన్ని డిపోల నుంచి వేళకు బస్సులు నడపాలని, ప్రయాణికులతో కండక్టర్లు, డ్రైవర్లు మర్యాదగా ప్రవర్తించి వారి మన్ననలు పొందాలని ఏపీఎస్ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.రవికుమార్ సూచించారు. జోన్–1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కార్యాలయంలో బుధవారం అన్ని జిల్లాల అధికారులు, డిపో మేనేజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూడాలని, ఆర్టీసీకి మరింత ఆదాయం పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వుమెన్ స్టార్టప్ హబ్ @ ఐఐఎంవీ

- మహిళా పారిశ్రామికవేత్తలకు ఐఐఎంవి ప్రోత్సాహం
- మహాత్మాగాంధీ ఫెలోషిప్ పొందిన 9వ ఐఐఎంగా రికార్డు
- 90కి పైగా మహిళల స్టార్టప్‌లకు ఇంక్యుబేషన్ సౌకర్యం
- 14 జిల్లాల్లో డిస్ట్రిక్ట్ స్టార్టప్ హబ్స్ ఏర్పాటుకు ప్రణాళికలు



ఐఐఎం విశాఖపట్నం క్యాంపస్



ఐఐఎంవీలో మహిళా పారిశ్రామికవేత్తలు

సాక్షి, విశాఖపట్నం: ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్-విశాఖపట్నం(ఐఐఎంవీ) విభిన్న ఆలోచనలతో ముందుకెళ్తోంది. మహాత్మాగాంధీ నేషనల్ ఫెలో షిప్ పొందిన 9వ ఐఐఎంగా చరిత్ర పుటల్లోకెక్కిన ఐఐఎంవీ.. మహిళల కోసం ప్రత్యేకంగా వుమెన్ స్టార్టప్ హబ్‌ను ప్రారంభించింది. ఇప్పటికే 90 మందికిపైగా మహిళల స్టార్టప్‌లకు ఇంక్యుబేషన్ సౌకర్యాన్ని కల్పించింది. మరోవైపు మూడు రాష్ట్రాల్లో ఎంపిక చేసిన 14 జిల్లాల్లో స్టార్టప్ హబ్‌లు ఏర్పాటుకు సన్నద్ధమవుతోంది.

రెండేళ్ల సుదీర్ఘ ఫెలోషిప్‌తో పాటు నైపుణ్యాభివృద్ధిని పెంపొందించడంలో భాగంగా అవసరమైన శిక్షణ, వనరులను సృష్టించే మహాత్మాగాంధీ నేషనల్ ఫెలోషిప్ ప్రోగ్రామ్ (ఎంజీఎన్ఎఫ్)ని ఐఐఎంవీ దక్కించుకుంది. ఇందుకు ఎంపికై న 75 మంది యువత ఆంధ్రప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, బిహార్ తదితర రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లో ఆయా కలెక్టర్ల వద్ద అండర్ స్టడీగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇదే స్ఫూర్తితో ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలను తీర్చిదిద్దేందుకు ప్రత్యేక స్టార్టప్ హబ్‌లను ఏర్పాటు చేయడంలో ఐఐఎంవీ విజయవంతంగా వ్యవహరిస్తోంది.

మహిళల కలలు సాకారం

ఐఐఎం విశాఖపట్నం క్యాంపస్‌కు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ గ్రూప్–3 సెంటర్(జీ3సీ) ఇంక్యుబేటర్‌ను మంజూరు చేసింది. నిబంధనల ప్రకారం ఈ సెంటర్‌ను సెక్షన్–8 కంపెనీగా నిర్వహించాల్సిన నేపథ్యంలో ఐఐఎంవీ ఫౌండేషన్ ఫర్ ఇంక్యుబేషన్, ఎంటర్‌ప్రెన్యూరియల్ లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్(ఐఐఎంవీ ఫీల్డ్)ను ఏడాదిన్నర కిందట ప్రారంభించింది. ఈ సెంటర్ మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు 90కిపైగా మహిళల నేతృత్వంలోని ఇక్కడ స్టార్టప్‌లు పురుడుపోసుకున్నాయి. తాజాగా 36 మంది మహిళా పారిశ్రామికవేత్తలతో మరో వుమెన్ స్టార్టప్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. ఇందులో ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, ఇతర రాష్ట్రాలకు చెందిన మహిళా పారిశ్రామికవేత్తలు తమ కలలను సాకారం చేసుకునే దిశగా సహకారం తీసుకుంటున్నారు. త్వరలోనే ఈ స్టార్టప్‌లలో పలు సంస్థలు పెట్టుబడులు పెట్టనున్నాయి.

డిస్ట్రిక్ట్ స్టార్టప్ హబ్‌లకు శ్రీకారం

మరోవైపు.. ఆంధ్రప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, బిహార్ రాష్ట్రాల్లో ఎంపిక చేసిన 14 జిల్లాల్లో డిస్ట్రిక్ట్ స్టార్టప్ హబ్‌ను ఏర్పాటు చేసేందుకు ఐఐఎంవీ సన్నద్ధమవుతోంది. క్యాంపస్ అధికారులు ఇప్పటికే ఆయా జిల్లాల కలెక్టర్లకు లేఖలు పంపించగా.. వారి సూత్రప్రాయంగా ఆమోదం లభించింది. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం, సామర్థ్య నిర్మాణానికి కృషి చేయడంతో పాటు వన్ నేషన్ వన్ ప్రొడక్ట్ అనే అంశాన్ని ప్రోత్సహించేందుకు కూడా డిస్ట్రిక్ట్ స్టార్టప్ హబ్‌లు ఉపయుక్తంగా నిలుస్తాయని క్యాంపస్ డైరెక్టర్ ప్రొ.చంద్రశేఖర్ తెలిపారు.